
సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

బుధవారం | 29 | మే | 2024



మళ్లీ మొదటికి!
సుమారు ఎనిమిది సంవత్సరాలుగా ఇదిగో అదిగో అంటూ అన్నవరం దేవస్థానం అధికారులను ఊరించిన కేంద్ర ప్రభుత్వ 'ప్రసాద్' పథకం మళ్లీ మొదటికొచ్చింది.

8 లో



తడబడితే తప్పదు మూల్యం
తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించేందుకు మంచి విద్యాలయాల కోసం వెతుకులాట ప్రారంభించారు. ఈ క్రమంలో జాగ్రత్తలు తీసుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

గరిష్టం/కనిష్టం
42.0°/29.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	42.0	29.0
కాకినాడ	38.5	29.4
అమలాపురం	41.0	31.0

న్యూస్‌రీల్

బాలబాలాజీ హుండీ రాబడి రూ.32.78 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న వలంటీర్లు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి వారి హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. 62 రోజులకు స్వామివారికి హుండీల ద్వారా రూ.32,78,548 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి గ్రంధి మాధవి తెలిపారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా దేవదాయ శాఖ సహాయ కమిషనర్ డి.నాగమల్లేశ్వరరావు పర్యవేక్షణలో హుండీల లెక్కింపు జరిగింది. హుండీల ద్వారా 32 గ్రాముల బంగారం, 140 గ్రాముల వెండి లభించాయన్నారు. ఆలయ ఉద్యోగులతో పాటు పలు స్వచ్ఛంద సంస్థలకు చెందిన వలంటీర్లు లెక్కింపులో సేవలందించారు.

రెండో రోజు పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్

అయినవిల్లి: ముక్తేశ్వరం వైవీఎస్ అండ్ బీఆర్ఎం కళాశాలలో మంగళవారం పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్‌ను ప్రారంభించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె. విశాల తెలిపారు. రెండు రోజులుగా పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని ఆమె చెప్పారు. ఒకటి నుంచి 27,000 ర్యాంకు వరకూ కౌన్సెలింగ్ నిర్వహించగా 64 మంది విద్యార్థులు హాజరయినట్టు తెలిపారు. వీరి సర్టిఫికెట్లు పరిశీలించి, ఇద్దరు విద్యార్థులను అనర్హులుగా ప్రకటించామన్నారు. బుధవారం 27,000 నుంచి 43,000 ర్యాంకు వరకూ కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

ఉపాధి హామీ పనుల్లో నాణ్యత



దేవగుప్తంలో ఉపాధి మస్తర్లను తనిఖీ చేస్తున్న డీపీఓ రాంబాబు

అల్లవరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రుపాయలు వెచ్చించి చేస్తున్న ఉపాధి పనుల్లో నాణ్యత, పారదర్శకత ఉండాలని డీపీఓ రాంబాబు అన్నారు. మండలంలోని దేవగుప్తం, గుండెపూడి గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో చేస్తున్న పనులను మంగళవారం ఎంపీడీఓ కృష్ణమోహన్‌తో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ రాంబాబు మాట్లాడుతూ ఉపాధి పనులు కనీసం 4 గంటల పాటు చేయాలని, కొలతల ప్రకారం ఉపాధి కూలీలు పని చేయాలన్నారు. ఉపాధి కూలీలతో పని చేయించే సమయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఉపాధి పనుల్లో నాణ్యతపై సిబ్బందిని డీపీఓ ప్రశ్నించారు. పనుల్లో నాణ్యత ఉండాలని, ఎక్కడా అవకతవకలకు చోటుండకూడదని సిబ్బందికి సూచించారు. పని ప్రదేశంలో మస్తర్లు నమోదు చేసి. పని ప్రదేశంలో ఫొటోని అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేస్తున్న పనులను పంచాయతీ కార్యదర్శులు తరుచుగా మస్తర్లు తనిఖీలు చేయాలన్నారు. ఈఓపీఆర్‌డీ ఎస్‌వీవీ సత్యనారాయణ, కార్యదర్శి పి.శ్రీనివాస్, టీఏ అనిల్, ఫీల్డ్ అసిస్టెంట్లు ఏడుకొండలు పాల్గొన్నారు. అనంతరం ఎంట్రుకోన సచివాలయాన్ని డీపీఓ రాంబాబు సందర్శించి బహిరంగ మల విసర్జన సర్వే పురోగతిపై సిబ్బందిని ప్రశ్నించారు. సర్వే పూర్తి చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఆ కార్యక్రమంలో కార్యదర్శి జ్యోతి, సుధామాధూరి, కోమలి, శాంతికుమారి పాల్గొన్నారు.

వయసు చిన్న.. ప్రతిభ మిన్న



నోబుల్ వరల్డ్ రికార్డ్స్ ధ్రువపత్రాన్ని జస్వికశ్రీకి అందజేస్తున్న కమిషనర్

కాకినాడ: పిట్ట కొంచెం.. కూత ఘనం అన్నట్టుగా పసిప్రాయంలోనే ఆ చిన్నారి ప్రతిభలో మిన్న అనిపించుకుంటోంది. కాకినాడకు చెందిన అవసరాల శేషగిరి, పరిమళ దంపతుల కుమార్తె జస్వికశ్రీ తన ప్రతిభతో ప్రపంచ రికార్డుల్లో స్థానం సంపాదించింది. ఐదు నెలల వయస్సు వచ్చేసరికే జస్వికశ్రీ పక్షులు, జంతువులు, కూరగాయలు, రంగులు, ఆకారాలు, వృత్తులను గుర్తు పట్టడాన్ని తల్లిదండ్రులు గమనించారు. దీనిని వీడియో తీసి, నోబుల్ వరల్డ్ రికార్డ్స్ సంస్థకు పంపించారు. అప్పటికే ఉన్న రికార్డును జస్వికశ్రీ బ్రేక్ చేసినట్లు తెలుపుతూ ఆ సంస్థ ప్రతినిధులు ధ్రువపత్రం పంపించారు. ఆ ధ్రువపత్రాన్ని జస్వికకు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు మంగళవారం తన కార్యాలయంలో అందజేశారు.



రావులపాలెంలో ప్రధాన పంట కాలువకు అనుబంధంగా ఉండే చానళ్లలో జరుగుతున్న పూడిక తీత పనులు

ఇళ్ల లబ్ధిదారులకు..

జిల్లాలోని వైఎస్సార్, జగనన్న కాలనీలు, వైఎస్సార్ గృహ నిర్మాణాల పథకంలో ఇళ్లు నిర్మించుకుంటున్న వారికి 90 రోజుల వేతనం రూపంలో ఉపాధి అమలు చేస్తున్నారు. వీరికి 90 రోజుల పని దినాలకు సంబంధించి వేతనాలను వారి ఖాతాలో జమ చేస్తున్నారు. ఇలా 606 పనులకు గాను 858 మందికి లబ్ధి చేకూరుతోంది. వీటితోపాటు పంట పొలాల్లో ట్రెంచ్ పనులు 55 చేపట్టగా 1,690 మందికి, మొక్కలు నాటే పనులు 16 చేస్తుండగా 31 మందికి, ఫారం పాండ్ రెండు పనులకు 62 మందికి, చెరువులలో పూడికతీత పనులు 14 చేపట్టగా 1,292 మందికి, పుంత రోడ్ల నిర్మాణ పనులు 26 చేపట్టగా 1,872 మందికి ఉపాధి పని కల్పిస్తున్నారు.



ఖరీఫ్ వేళ రిలీఫ్

- జోరుగా ఉపాధి పనులు
- కూలీలకు చేతినిండా పని.. సాగునీటికి హామీ
- పంట కాలువలు, బోదెలకు మోక్షం

సాక్షి, అమలాపురం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్‌జీఎస్) పనులు జిల్లాలో శరవేగంగా సాగుతున్నాయి. ఎన్నికల సందడిలో కూడా పనుల జోరు తగ్గలేదు. పంట కాలువలు, బోదెలలో పూడికతీత పనులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దీనివల్ల ఖరీఫ్‌లో పొలాలకు సక్రమంగా సాగునీరు అందనుంది. సార్వత్రిక ఎన్నికల సమయంలో జిల్లాలో ఉపాధి హామీ పనులు నిరాటంకంగా సాగాయి. జిల్లా గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులు వేసవిని దృష్టిలో పెట్టుకుని ప్రణాళికాబద్ధంగా పనులను గుర్తించారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే ప్రభుత్వం నుంచి అనుమతి సాధించారు. అందుకే ఎన్నికల సమయంలో కూడా ఎలాంటి ఆటంకాలు లేకుండా పనులు ముందుకు సాగాయి.

పెరిగిన వేగం

రబీ సాగు పూర్తి కావడం, పంట కాలువలు మూసివేయడం (క్లోజర్)తో పనులలో వేగం పెరిగింది. అడపాదడపా వర్షాలు పడుతున్నా ఏ మాత్రం ఆటంకం కలగడం లేదు. రోజుకు లక్ష మందికి పని కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. అయితే 89,896 మందికి మాత్రమే ఉపాధి కల్పిస్తున్నారు. కూలీలకు రోజుకు సగటున రూ.290 చొప్పున వేతనం రూపంలో దక్కుతోంది. జిల్లావ్యాప్తంగా రూ.2.60 కోట్లకు పైగా వేతనం కూలీలకు అందేలా అధికారులు పనులు చేపట్టారు.

పంట కాలువలకు ప్రాధాన్యం

వేసవిలో చేపట్టిన పనుల్లో పంట కాలువలు, బోదెల్లో పూడికతీతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. జిల్లాలోని తూర్పు, మధ్య డెల్టాల పరిధిలో ప్రధాన పంట కాలువలతో పాటు, చానళ్లు, పంట బోదెలలో పూడికతీత పనులు చేపట్టారు. పంట కాలువల వెంబడి మట్టి తొలగింపు, జంగిల్ క్లియరెన్స్ వంటివి చేస్తున్నారు. ప్రధాన పంట కాలువలకు అనుసంధానంగా ఉన్న డైరెక్టర్ పైప్ (డీపీ)ల వద్ద పూడిక తీయడం వల్ల ఆయకట్టు రైతులకు అధికంగా మేలు జరగనుంది.

పనుల వివరాలు

పంట కాలువలపై 828 పనులు చేపట్టగా వీటి ద్వారా 61,398 మందికి ఉపాధి దొరుకుతోంది. వేతనాల రూపంలో రూ.1.78 కోట్లు అందిస్తున్నారు.

ఇక పంట బోదెలకు సంబంధించి 415 పనులు చేపట్టగా రోజుకు 22,693 మందికి ఉపాధి కల్పిస్తున్నారు. వీరికి ఉపాధి వేతన రూపంలో రూ.65.80 లక్షల ఖర్చు చేస్తున్నారు. మొత్తం మీద పంట కాలువలు, బోదెలకు కలిపి రోజుకు రూ.2.43 కోట్లు ఖర్చు చేస్తున్నారు.

రైతులకు మేలు



వేసవిలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులు రైతుల అవసరాలకు తగినట్టుగా చేపట్టాం. వారికి మేలు చేసేలా పంట కాలువలు, బోదెలలో పూడిక తీత పనులు జరుగుతున్నాయి. పొలాల్లో ట్రెంచ్ పనులు, పుంత రోడ్లు, చెరువుల ఆధునీకరణ జరుగుతోంది. వీటివల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతోంది.

– ఎస్.మధుసూదనరావు, డ్వామా పీడీ

చెరువు ఆధునీకరణ

అల్లవరం మండలం దేవగుప్తంలో ఫారం పాండ్ పనులలో భాగంగా గ్రామంలో అధ్వానంగా ఉన్న చెరువును ఆధునీకరిస్తున్నారు. దీని అంచనా విలువ రూ.3,11,600. కూలీలకు వేతనాల రూపంలో రూ.2,89,294 అందించనున్నారు. మొత్తం 993 పనిదినాలుగా గుర్తించారు. ఈ మండల పరిధిలోని 21 గ్రామాలలో 49 పనులు చేపట్టారు. రోజుకు 3,902 పని దినాలు కల్పించాల్సి ఉండగా, 3,096 మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

చెరువుకు మోక్షం



విశ్వేశరాయపురంలో చెరువులో పూడికతీత పనులు

మల్కిపురం మండలం విశ్వేశ్వరరాయపురంలో ఉపాధి హామీ పథకంలో చెరువులో పూడికతీత పనులు చేపట్టారు. స్థానికంగా 15 రజక కుటుంబాలకు, పాడి రైతులకు మేలు చేసే ఈ చెరువు ఆధునీకరణ పనులు రూ.5 లక్షలతో చేపట్టారు. ఈ పనులు దాదాపు పూర్తి కావస్తున్నాయి.



ఐ.పోలవరం పంట కాలువలో పూడికను తొలగిస్తున్న ఉపాధి కూలీలు

సాగునీటికి ఆటంకం లేకుండా..

ఐ.పోలవరంలోని ప్రధాన పంట కాలువలో పూడిక తీత, చెట్ల తొలగింపు పనులు చేపట్టారు. వీటిలో రోజుకు 350 మంది వరకూ పనిచేస్తున్నారు. ఈ కాలువపై సుమారు 5 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. పూడిక తొలగింపు వల్ల ఖరీఫ్‌లో ఆయా చేలకు వచ్చే సాగు నీటికి ఆటంకాలు ఉండవు.



రావులపాలెం మండలం దేవరపల్లిలో పూడికతీత పనులు

పూడికతీత పనులు

రావులపాలెం మండలంలో డెల్టా ప్రధాన పంట కాలువలో పూడిక తీత పనులు శరవేగంగా సాగుతున్నాయి. పూడిక, మొక్కలను కూలీలు తొలగిస్తున్నారు. దేవరపల్లి గరువు వద్ద నుంచి స్టీల్ ప్లాంట్ వరకు ఈ పనులు జరుగుతున్నాయి. మొత్తం పని విలువ రూ.6,73,959 కాగా, ఇప్పటి వరకు రూ.3,51,632 ఖర్చు చేశారు. 2,494 పనిదినాలు కాగా, రోజుకు 135 మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

పకడ్బందీగా కౌంటింగ్

కలెక్టర్ హిమాన్షు శుక్లా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

సాక్షి, అమలాపురం: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని, రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఓట్ల లెక్కింపు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి కావచ్చాయని ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు, సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 13వ తేదీన పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం ఈవీఎంలను చెయ్యేరు ఇంజినీరింగ్ కాలేజీల్లోని స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచామన్నారు. జూన్ నాలుగో తేదీ ఉదయం ఎనిమిది గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని చెప్పారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి కౌంటింగ్ హాల్లో ప్రతి నియోజకవర్గానికి టేబుళ్లు ఏర్పాటు చేశామన్నారు. పోస్టల్ బ్యాలెట్లు, సర్వీస్ ఓటర్ల లెక్కింపు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టామన్నారు. ప్రతి నియోజకవర్గానికి పోస్టల్ బ్యాలెట్ కోసం ఒక టేబుల్, సర్వీస్ ఓటర్ల కోసం మరో టేబుల్ కేటాయించి మూడు రౌండ్లలో సుమారు 18,000 ఓట్లు లెక్కించనున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలో 1,644 పోలింగ్ కేంద్రాలలో జిల్లావ్యాప్తంగా ఉన్న 15,31,410 మంది ఓటర్లలో 12,84,008 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని ఆయన తెలిపారు. ఏడు నియోజక వర్గాల ఓట్ల లెక్కింపు కోసం 88 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు. పార్లమెంట్ నియోజకవర్గానికి 82 టేబుళ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గంలో 24 రౌండ్లలో, ముమ్మిడివరం 19 రౌండ్లలో, అమలాపురం 20, రాజోలు 15 , పి.గన్నవరం 18, కొత్తపేట అసెంబ్లీ 26, మండపేట 22 రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తికానున్నదన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, ప్రధాన ఎన్నికల ఏజెంట్లు, లెక్కింపు సిబ్బందికి ఒక మార్గాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. లెక్కింపు ఏజెంట్ల కోసం మాత్రం వేరే మార్గాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్, సర్వీస్ ఓటర్లు లెక్కింపు పర్యవేక్షణకు సహాయ రిటర్నింగ్ అధికారులుగా ఉన్న తహసీల్దార్లు వారి పరిధిలోని డిప్యూటీ తహసీల్దార్లను నియమించామన్నారు ప్రతి రౌండ్ పూర్తి కాగానే ఫలితాలను వెల్లడించేలా ఏర్పాటు చేశామన్నారు. డీఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లు సూపరింటెండెంట్ టి.వైద్యనాథశర్మ, రాజకీయపార్టీ ప్రతినిధులు దూరి రాజేష్, వడ్డి నాగేశ్వరరావు, కేఎస్ఎల్ భవాని, కారెం వెంకటేశ్వరరావు, పి.పవన్ సూర్య పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే చికిత్స సులభం

క్యాన్సర్‌పై జిల్లా ప్రభుత్వ వైద్యులకు అవగాహన సదస్సు



సదస్సులో పాల్గొన్న జిల్లా వైద్యులు

అమలాపురం టౌన్: క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తిస్తే ఆ వ్యాధికి నిరోధానికి అవసరమైన వైద్యం, చికిత్స అందించడం సులభం అని డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు దొర అన్నారు. కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో మూడు రోజులపాటు వైద్యులకు జరిగిన అవగాహన సదస్సుల్లో జిల్లాకు చెందిన ప్రభుత్వ వైద్యులు పాల్గొనే ఈ విషయం స్పష్టం చేసినట్టు ఆయన మంగళవారం తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య కమిషనర్, కుటుంబ సంక్షేమ శాఖ ఆదేశాలతో నిర్వహించిన ఈ సదస్సులో జిల్లాకు సంబంధించి వైద్య విధాన పరిషత్‌కు చెందిన గైనకాలజిస్టులు, డెంటిస్టులు హాజరయ్యారని పేర్కొన్నారు. రేడియాలజీ, డెంటల్, అంకాలజీ విభాగాలకు చెందిన వైద్య నిపుణులైన ప్రొఫెసర్లు ఈ మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో ప్రాథమికంగా క్యాన్సర్‌ను ఎలా గుర్తించాలి, ఎలాంటి చికిత్స అత్యవసరంగా మొదలు పెట్టాలనే అంశాలపై అవగాహన కల్పించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులు గ్రామాల్లో ఉన్న వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల్లో పనిచేస్తున్న సిబ్బందికి, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు పూర్తి అవగాహన కల్పించాలని ప్రొఫెసర్లు వైద్యులకు సూచించారు. వారితో నాన్ కమ్యూనికబుల్ వ్యాధుల సర్వేలో ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను ఏ విధంగా అన్వేషించాలి. ఎలా గుర్తించాలి. ప్రాథమిక దశలో గుర్తించిన రోగులకు తక్షణమే ఎలాంటి వైద్యం అందించాలనే పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సదస్సుల్లో నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.రుక్మిణీదేవి, డాక్టర్ హేమలత, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జాన్‌లెవీ, అకౌంట్ ఆఫీసర్ వెంకట శ్రీనులతో పాటు ఎన్సీడీలు పాల్గొన్నారు.

దర్శనాలకు బ్రేక్



సామర్లకోటలోని పంచారామ క్షేత్రం

- సామర్లకోట పంచారామ క్షేత్రంలో నేటి నుంచి జీర్ణోద్ధరణ పనులు
- శివలింగానికి కెమికల్ ట్రీట్‌మెంట్
- వచ్చే నెల 8 వరకూ కొనసాగనున్న కార్యక్రమం
- పురావస్తు శాఖ ఆధ్వర్యాన నిర్వహణ

సామర్లకోట: రాష్ట్రంలోని పంచారామాల్లో అత్యంత ప్రాచీనమైనదిగా ప్రసిద్ధి చెందిన క్షేత్రం సామర్లకోట. ఇక్కడ బాలాత్రిపురసుందరీ సమేతుడై యోగ లింగరూపుడై వెలసిన కుమారారామ భీమేశ్వర స్వామి మనసారా కోరిన కోర్కెలు తీర్చుతాడన్నది భక్తుల విశ్వాసం. ఇక్కడకు ప్రతి రోజూ వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి, స్వామివారికి, అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు నిర్వహిస్తూంటారు. పరమేశ్వరునికి ప్రీతికరమైన సోమవారం, మాస శివరాత్రి వంటి రోజుల్లో అత్యధికంగా వస్తూంటారు. కొన్ని వందల సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ ఆలయంలో స్వామి వారి శివలింగం జీర్ణావస్థకు చేరుతోంది. దేవదాయ శాఖ అధికారులు శివలింగం పరిస్థితిని పురావస్తు శాఖ అధికారులకు నివేదించారు. ఈ మేరకు మేరకు శివలింగానికి జీర్ణోద్ధరణ పనులు చేపట్టాలని కేంద్ర పురావస్తు శాఖ (ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా) అధికారులు సూచించారు. దీనిలో భాగంగా బుధవారం నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకూ పురావస్తు శాఖ ఆధ్వర్యాన ఈ క్షేత్రంలో జీర్ణోద్ధరణ పనులు చేపట్టనున్నారు. ఇవి పూర్తయ్యేంత వరకూ స్వామి వారి మూలవిరాట్టుతో పాటు అమ్మవారి దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించారు.

శాస్త్రోక్తంగా..

పంచారామ క్షేత్రంలో శివలింగం జీర్ణోద్ధరణ పనులు శాస్త్రోక్తంగా చేపట్టనున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం మండపారాధన, కలశ స్థాపన, కళారాధన, దేవాతారాధన, అగ్నిహోత్ర సంబంధమైన హోమాలు నిర్వహిస్తారు. దీని ద్వారా స్వామివారి కళలను పూర్ణకుంభంలోకి ఆవాహన చేస్తారు. ఈ పూర్ణకుంభాన్ని, స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను భక్తుల దర్శనార్థం నంది మండపంలో ఏర్పాటు చేస్తారు. ఈ మేరకు దేవదాయ శాఖ అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ క్రతువుల అనంతరం జీర్ణోద్ధరణ పనులకు శ్రీకారం చుడతారు.

ఇంటి వంటలు మరిపించేలా మధ్యాహ్న భోజనం



మధ్యాహ్న భోజనం నిర్వాహకుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న డీఈవో కమలకుమారి

అమలాపురం రూరల్: ఇంటి వంటలు మరిపించే విధంగా స్కూల్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె.కమలకుమారి సూచించారు. అమలాపురం మండలంలో పేరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పథకం నిర్వహించే నిర్వాహకులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అమరావతి స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్, జిల్లా విద్యాశాఖ అధికారి ఉత్తర్వుల ప్రకారం ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై అసిస్టెంట్ డైరెక్టర్ (ఎండీఎం) సురేష్ మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టకాహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు ఎంతో ఉత్సాహంగా వంటల పోటీలలో పాల్గొన్నారు. మండల విద్యాశాఖ అధికారి దుర్గాదేవి, ప్రధానోపాధ్యాయుడు ఎస్.పురుషోత్తంరాజు, మధ్యాహ్నం భోజనం నిర్వాహకుల సంఘం నాయకులు కొల్లాటి దుర్గాబాయి, ఎంఐఎస్ రెహమాన్, సీవో అన్నపూర్ణ, సీఆర్పీలు త్రినాథ్, నాగు మండల సిబ్బంది పాల్గొన్నారు.

28 మోటారు సైకిళ్లు సీజ్

42 మద్యం సీసాల పట్టివేత

అమలాపురం టౌన్: ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జిల్లా పోలీసులు, కేంద్ర బలగాలు జిల్లాలో దాడులు, తనిఖీలు నిర్వహిస్తున్నాయి. అక్రమ మద్యం, రికార్డులు లేకుండా తిరుగుతున్న మోటారు సైకిళ్ల స్వాధీనం వంటి చర్యలు చేపడుతున్నాయి. జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆదేశాలతో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో ఈ దాడులు, తనిఖీలను మంగళవారం మరింత విస్తృతం చేశారు. జిల్లాలో నిర్వహించిన క్యాసో తనిఖీలు, దాడుల ద్వారా మొత్తం 42 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. 28 మోటారు సైకిళ్లను సీజ్ చేశారు. వీటి వివరాలను జిల్లా ఎస్పీ కార్యాలయం ఓ ప్రకటనలో వివరించింది.

- పామర్రు పోలీసు స్టేషన్ పరిధిలో ఎస్సై ఎస్‌కే జాని బాషా ఆధ్వర్యంలో సిబ్బంది మద్యం అక్రమ తరలింపుపై కేసు నమోదు చేశారు. అయిదుగురిని అరెస్ట్ చేసి కారును సీజ్ చేశారు. కారులో రూ.13, 353 విలువైన 22 నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను ఉంచి అక్రమ రవాణా చేస్తున్నందుకు వారిని అరెస్ట్ చేశారు.
- రామచంద్రపురం పట్టణం అంబికాపల్లి అగ్రహారంలో పోలీసులు క్యాసో తనిఖీలు నిర్వహించారు. రికార్డులు సరిగా లేని 9 మోటారు సైకిళ్లను సీజ్ చేశారు. పట్టణంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి ఓట్ల లెక్కింపు రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.
- రామచంద్రపురం పట్టణం నరసాపురపుపేటలో ఎస్సై కె.సురేష్‌బాబు తన సిబ్బందితో క్యాసో తనిఖీలు నిర్వహించారు. రికార్డులు లేని 19 మోటారు సైకిళ్లను సీజ్ చేశారు.
- ఐ.పోలవరం మండలం భైరవలంక, ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లి, రాఘవులపేట, అంబాజీపేట మండలం ముక్కామల, ఆత్రేయపురం మండలం ఉచ్చిలి, మండపేట రూరల్ మండలం వేములపల్లి, కేశవరం, మామిడికుదురు మండలం గోగన్నమఠం, కపిలేశ్వరపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయా పోలీసు అధికారులు స్థానిక ప్రజలతో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలతో అవగాహన సదస్సులు నిర్వహించారు.
- కాట్రేనికోన పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ.2,600 విలువైన 20 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.
- పి.గన్నవరం మండలం నాగుల్లంకలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.4,800 నగదును సీజ్ చేశారు.
- కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ రోజున బందోబస్తు నిర్వహించిన ఎన్‌సీసీ, ఎస్ఎస్ఎస్ విద్యార్థులకు రూ.500 గౌరవ వేతనం, ప్రశంసా పత్రాన్ని డీఎస్పీ కేవీ రమణ, సీఐ ఎం.రామ్‌కుమార్ అందజేశారు.

క్లుప్తంగా

పాశర్లపూడి ఓఎన్‌జీసీ బావి సమీపంలో అగ్ని ప్రమాదం


ఓఎన్‌జీసీ గ్రౌండ్‌లో ఎగసి పడుతున్న మంటలు

మామిడికుదురు: మండలంలోని పాశర్లపూడి-27 బావి సమీపంలో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. బావికి సుమారు 40 మీటర్ల దూరంలో ఈ ప్రమాదం జరగడంతో స్థానికులు తీవ్రంగా భయపడ్డారు. సమాచారాన్ని వెంటనే ఓఎన్‌జీసీ అధికారులకు తెలియజేశారు. ఈ బావి నుంచి సహజ వాయువు (గ్యాస్) నగరంలోని తాటిపాక జీసీఎస్‌కు సరఫరా అవుతోంది. సమాచారం అందుకున్న వెంటనే ఓఎన్‌జీసీ అధికారులు పాశర్లపూడి-27 బావి నుంచి ఉత్పత్తిని నిలిపివేశారు. ఓఎన్‌జీసీ నుంచి రెండు, రాజోలు ఫైర్‌స్టేషన్ నుంచి ఒకటి కలిపి మొత్తం మూడు ఫైరింజన్లు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేయడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఆకతాయిలు ఓఎన్‌జీసీ గ్రౌండ్‌లో నిప్పు ఉన్న సిగరెట్‌ను పడేయడంతో అక్కడ భారీగా ఉన్న చెత్త, చుట్టుపక్కల ఉన్న ఎండిపోయిన పొదలు, ముళ్లకంపలు అంటుకొని ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

మద్యం పట్టివేత


పట్టుకున్న మద్యం సీసాలను సీజ్ చేసిన సీఐ దొరరాజు, ఎస్సై జానీ భాష

కె.గంగవరం: మండల పరిధిలోని మసకపల్లి ఏటిగట్టు రహదారి నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని సోమవారం రాత్రి రామచంద్రపురం సీఐ పి.దొరరాజు, ఎస్సై జానీ భాష పట్టుకుని సీజ్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ దొరరాజు మాట్లాడుతూ నెల్లూరు జిల్లా ఇందుకూరుకు చెందిన ఐదుగురు వ్యక్తులు యానాం వచ్చి అక్కడ రూ.13,500 విలువ చేసే వివిధ బ్రాండులకు చెందిన 22 సీసాల మద్యాన్ని కొనుగోలు చేసి స్కోడా కారుపై తరలిస్తున్నారు. పోలీసులకు అందిన సమాచారంతో ఏటిగట్టుపై వాహనాన్ని తనిఖీ చేసి సుంకం చెల్లించిన మద్యాన్ని గుర్తించి సీజ్ చేశారు. ఐదుగురిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

తడబడితే తప్పదు మూల్యం

- ముందస్తు అడ్మిషన్లతో జాగ్రత్త
- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలు
- పాఠశాలల గురించి తెలుసుకున్నాకే పిల్లలను చేర్పించాలి
- ప్రభుత్వ గుర్తింపు, రిజిస్ట్రేషన్ ఉంటేనే ముందుకెళ్లడం మంచిది



అమలాపురం టౌన్/బాలాజీచెరువు (కాకినాడ సిటీ): వేసవి సెలవులు ముగుస్తున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించేందుకు మంచి విద్యాలయాల కోసం వెతుకులాట ప్రారంభించారు. ఇదే సమయంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలు ముందస్తు అడ్మిషన్లపై దృష్టి సారించాయి. చాలా విద్యాసంస్థలు తమకు ప్రభుత్వ గుర్తింపు, రిజిస్ట్రేషన్ లేకుండానే అడ్మిషన్ల పర్వానికి తెర తీశాయి. ఆకర్షణీయమైన బ్రోచర్లు, ప్రకటనలు, ప్రచారాలతో విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకునే ప్రయత్నాలు సాగిస్తున్నాయి. అందుకే అడ్మిషన్లు తీసుకోవడానికి ముందే తల్లిదండ్రులు అప్రమత్తమై సదరు విద్యాసంస్థకు అన్ని అనుమతులు ఉన్నాయో లేదో, మౌలిక సదుపాయాల కల్పన ఎలా ఉందో సరి చూసుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

ప్రభుత్వ గుర్తింపు లేకుండానే తరగతులు

కోనసీమ జిల్లాలో దాదాపు 200కి పైగా ప్రైవేటు విద్యా సంస్థలున్నాయి. అయితే పలు విద్యా సంస్థలు తమ బోర్డులపై రిజిస్ట్రేషన్ పొందిన సంస్థ అని రాస్తున్నారు గాని వాటిలో కొన్ని ప్రభుత్వం నుంచి ఎలాంటి గుర్తింపు లేకుండానే నడుస్తున్నాయి.కొన్ని పాఠశాలలు సీబీఎస్‌ఈ అనుమతులు ఉన్నట్టు ప్రచారం చేస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్త ప్రైవేటు పాఠశాల ప్రారంభించాలంటే విద్యాశాఖ అనుమతి తీసుకోవాలి. మొదట ప్రారంభానికి అనుమతి తీసుకున్న తర్వాతే విద్యా సంస్థలను తెరచి విద్యార్థులను చేర్చుకోవాలి. తర్వాత పూర్తి స్థాయి అనుమతి పొందాలి. ప్రాథమిక స్థాయికి జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి, ఉన్నత తరగతులు ప్రారంభించాలంటే విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ (ఆర్జేడీ) ద్వారా పాఠశాల విద్యా కమిషనర్ అనుమతి తీసుకోవాలి. సీబీఎస్‌ఈ సిలబస్ బోధించేందుకు కేంద్ర విద్యామండలి సమ్మతించాలి. కానీ కొన్ని విద్యా సంస్థలు మసిపూసి మారేడు కాయ చేస్తూ ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నడుస్తున్న అలాంటి పాఠశాలలు ఏడాది చివరలో ఇతర విద్యాసంస్థల పేరున విద్యార్థులతో పరీక్షలు రాయించి మమ అనిపించేస్తున్నాయి. అలా పరీక్ష రాసిన విద్యార్థులను ప్రభుత్వం ప్రైవేటు విద్యార్థిగానే తప్ప రెగ్యులర్ విద్యార్థిగా పరిగణించదు. అలాగే మరికొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు బ్రాంచీల పేరుతో వేరే చోట పాఠశాలలు, కళాశాలలను నిర్వహిస్తూ ఎక్కడో ఉన్న మెయిన్ బ్రాంచి ద్వారా పరీక్షలు రాయిస్తున్నాయి. ఈ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి తమ పిల్లలను చేర్పించే విద్యా సంస్థ అనుమతి పత్రాలను ముందుగానే నిశితంగా పరిశీలించుకోవాలి. అక్కడ ఉండే మౌలిక సౌకర్యాలేంటో ఆరా తీయాలి. ప్రభుత్వ గుర్తింపు లేని ప్రైవేటు పాఠశాలల్లో తమ పిల్లలను చదివిస్తే భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను ముందే అంచనా వేసి తల్లిదండ్రులు నిర్ణయం తీసుకోవాలి. ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయిన ప్రైవేటు విద్యాసంస్థలపై విద్యాశాఖ అధికారుల చర్యలు అంతంత మాత్రమే కావడంతో ప్రైవేటు విద్యాసంస్థలు ఆడింది ఆట పాడింది పాటగా సాగుతోంది. అందుకే తల్లిదండ్రుల నిశిత పరిశీలన, వివేకంతో తీసుకునే నిర్ణయం వారి పిల్లల చదువుల అభ్యున్నతికి చక్కని పునాది పడేలా చేస్తుంది.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలనుకునే ప్రైవేటు పాఠశాలకు ప్రభుత్వం నుంచి గుర్తింపు ఉందో లేదో తెలుసుకున్న తరువాతే అడ్మిషన్ పొందాలి.
- సదరు పాఠశాలలో మౌలిక వసతులైన తాగునీటి సరఫరా, మరుగుదొడ్లు, క్రీడా ప్రాంగణం , గాలి, వెలుతురు సక్రమంగా ఇచ్చే భవనాలు ఎంత వరకూ ఉన్నాయనే అంశాలను ముందస్తుగా పరిశీలించుకోవాలి.
- తమ పిల్లలను పాఠశాలకు తీసుకొచ్చే వాహనాలు ఎలా ఉన్నాయి, వాటిని పాఠశాలే సమకూర్చుతుందా, బయట నుంచి మనమే ఏర్పాటు చేసుకోవాలా? అనే అంశాలపై ఆరా తీయాలి.
- ఒక్కో తరగతి గదిలో ఎంతమంది విద్యార్థులను కూర్చోబెడతారు? విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయ నియామకాలు ఉన్నాయా లేదా? అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులు ఉన్నారా అన్న విషయాన్ని తెలుసుకోవాలి.
- జీ+1 భవనమైతే అగ్నిమాపక నిబంధనలు పాటిస్తున్నారా? అందుకు అవసరమైన యంత్ర పరికరాలు, సామగ్రిని సిద్ధంగా ఉంచారో లేదో ఆరా తీయాలి.

నిబంధనలు పాటించని పాఠశాలలపై నిఘా



త్వరలో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లాలో నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై నిఘా పెట్టాం. నిబంధనలు అతిక్రమించే ప్రైవేటు పాఠశాలల గుర్తింపు రద్దు చేస్తాం. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్చే ముందు ప్రభుత్వ గుర్తింపు, రిజిస్ట్రేషన్ వంటి అంశాలను బాగా పరిశీలించుకున్న తర్వాతే అడ్మిషన్లు పొందాలి.

– ఎం.కమలకుమారి, డీఈవో

రగ్బీ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

పిఠాపురం: పట్టణంలో ఉన్న మినీ స్టేడియంలో మంగళవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి రగ్బీ పోటీలకు జూ నియర్స్ విభాగంలో బాలికలు, బాలురను ఎంపిక చేశారు. 40 మంది పాల్గొనగా 10మంది బాలికలు, 10 బాలురను ఎంపిక చేసినట్లు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నా గేంద్ర కుమార్ తెలిపారు. ఎంపికైన ఈ క్రీడాకారులు ఈ నెల 31నుంచి జూన్ 1వ తేదీ వరకు విశాఖ జిల్లా తిమ్మాపురంలో జరగబోయే రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారన్నారు. ఈ ఎంపికలో టెక్నికల్ కమిటీ చైర్మన్ నాగలింగేశ్వరావు, కె.పద్మనాభం, న్యాయ నిర్ణేతలు బి.వంశీ, జి.శివప్రసాద్, పి.సా యి, బార్గవ సతీష్, కోచ్ పి.లక్ష్మణ రావు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

రాజమహేంద్రవరం రూరల్: మనస్తాపం చెందిన ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బొమ్మూరు వెంకటగిరికొండపై సోమవారం అర్ధరాత్రి 1.30గంటల సమయంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం బొమ్మూరు జేఎల్‌బీ నగర్‌కు చెందిన పరాస ఆంజనేయులు(40) పెయింటింగ్ పనిచేస్తుంటాడు. నాలుగేళ్ల క్రితం అతని భార్య, ముగ్గురు అబ్బాయిలు వదిలేసి వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఆంజనేయులు జేఎల్‌బీనగర్‌లో తల్లి పద్మతో కలిసి జీవిస్తున్నాడు. ఆంజనేయులు సోమవారం రాత్రి బొమ్మూరు వెంకటగిరికొండపై ఉన్న పెద్దమ్మ వీరమల్ల వెంకటలక్ష్మి ఇంటికి వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో రేకులషెడ్డు ఇంటిలో ఉరివేసుకుని ఆంజనేయులు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆంజనేయులు తల్లి పరాస పద్మ ఫిర్యాదు మేరకు బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఎస్సై ఆర్.అంకారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం బంధువులకు మృతదేహాన్ని అప్పగించారు.

మళ్లీ మొదటికి!



ప్రసాద్ స్కీం లోగో


ఆలయ ప్రాంగణంలో నిర్మాణాలు పరిశీలిస్తున్న కేంద్ర బృందం అధికారులు

- ముందుకు సాగని ప్రసాద్ పథకం పనులు
- రత్నగిరిపై నిర్మాణాల స్థలాలు పరిశీలించిన కేంద్ర టూరిజం బృందం
- నిధులు విడుదల చేయకుండా పరిశీలన, నివేదికలంటూ కాలయాపన

అన్నవరం: ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అంటే ఇదే కాబోలు. సుమారు ఎనిమిది సంవత్సరాలుగా ఇదిగో అదిగో అంటూ అన్నవరం దేవస్థానం అధికారులను ఊరించిన కేంద్ర ప్రభుత్వ 'ప్రసాద్' (పిలిగ్రిమేజ్ రీజువనేషన్ అండ్ స్పిరిచ్యువల్ అగ్మంటేషన్ డ్రైవ్) మళ్లీ మొదటికొచ్చింది. ఈ స్కీం కింద రూ.20.06 కోట్ల విలువైన నిర్మాణ పనులను గత మార్చి నెలలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చ్యువల్‌గా లాంఛనంగా ప్రారంభించిన విషయం విదితమే. ఇంత జరిగాక కూడా కేంద్ర టూరిజం అధికారులు నిధులు విడుదల చేయకుండా పరిశీలన, సమావేశాలంటూ కాలయాపన చేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో కేంద్ర టూరిజం శాఖలోని ప్రసాద్ స్కీంలో పనిచేసిన అధికారులు బదిలీ అయి కొత్తగా వచ్చిన అధికారులు మళ్లీ దీనికి సంబంధించిన పనులు మొదటి నుంచి ప్రారంభించాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

నిర్మాణ స్థలాలను పరిశీలించిన కమిటీ

ప్రసాద్ స్కీం కింద నిర్మించనున్న వివిధ నిర్మాణాల స్థలాలను కేంద్ర టూరిజం శాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. కేంద్ర టూరిజం శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుదీప్తో మోండల్, కన్సల్టెంట్ కనికా దత్తా రత్నగిరిపై ప్రసాద్ స్కీం నిర్మాణాల స్థలాలను పరిశీలించిన అనంతరం దేవస్థానం ఈఓ కె.రామ చంద్రమోహన్, ఇతర అధికారులతో సమావేశమై చర్చించారు. ప్రసాద్ నిధులతో చేపట్టనున్న అన్నదాన భవనం, వ్రత మంటపాలు, క్యూ కాంప్లెక్స్ నిర్మాణాల ఆవశ్యకత, భక్తులను ఆలయానికి చేర్చేందుకు చేపట్టనున్న ఆరు ఎలక్ట్రానిక్ కార్ల అవసరాన్ని ఈఓ వారికి వివరించారు. దీనిపై వారు నివేదిక సమర్పించాక దానిపై మరోసారి కేంద్ర టూరిజం శాఖ అధికారులు సమావేశమై చర్చిస్తారు. అనంతరం నిధుల విడుదలపై నిర్ణయం తీసుకుంటారని అధికారులు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ సీఈ సీఎస్ఎన్ మూర్తి, ఈఈ ఎంవీ రాజారావు, మేనేజర్ బ్రహ్మ నందరెడ్డి, దేవస్థానం ఈఈలు మురళి, నరసింహారెడ్డి, డీఈలు బీఎస్ రాంబాబు, గుర్రాజు పాల్గొన్నారు.

మొదటి నుంచీ చిన్నచూపు, కాలయాపన

'ప్రసాద్' స్కీం నిధులు మంజూరు చేస్తామని, ప్రతిపాదనలు పంపించమని అన్నవరం దేవస్థానానికి కేంద్ర ప్రభుత్వం చెప్పి దాదాపు ఎనిమిదేళ్లయింది. అప్పటి నుంచి కేంద్ర టూరిజం అధికారులు కాలయాపన చేయడంతో బాటు నిధులను కూడా తగ్గిస్తూ వచ్చారు. 2016లో కేంద్ర టూరిజం శాఖ కోరిక మేరకు దేవస్థానం అధికారులు రూ.92 కోట్లు ప్రతిపాదనలు పంపగా సుమారు ఐదేళ్లు వివిధ సమావేశాలు, చర్చలు, కేంద్ర బృందాల పర్యటనలు అనంతరం 2020లో రూ.54 కోట్లకు డీపీఆర్ తయారు చేయించారు. ఆ తరువాత 2023లో రూ.పది కోట్లు మాత్రమే మంజూరు చేస్తామని చెప్పి ఆ మేరకు ప్రతిపాదనలు పంపించమన్నారు. అయితే ప్రసాద్ నిధుల మంజూరు చేయించేందుకు ఐదేళ్లుగా కృషి చేస్తున్న కాకినాడ ఎంపీ వంగా గీత కేంద్ర టూరిజం శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి నిధులు పెంచాలని కోరారు. దీంతో రూ.20.06 కోట్లు మంజూరు చేశారు.

మార్చి ఏడో తేదీన ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన

2024 సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ మరో కొద్ది రోజుల్లో వెలువడే తరుణంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ గత మార్చి ఏడో తేదీన కాశ్మీర్ రాజధాని శ్రీనగర్ నుంచి ప్రసాద్ స్కీం పథకాలకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. దీంతో ప్రసాద్ నిర్మాణాలకు నిధులు విడుదల అవుతాయని, టెండర్లు పిలవడమే తరువాయి అని అందరూ భావించారు. ఈ తరుణంలో మళ్లీ కేంద్ర టూరిజం శాఖ అధికారులు పరిశీలనకు రావడంతో పనులు మొదటి కొచ్చినట్టయింది.


నిధులు వెంటనే మంజూరు చేయమని కోరాం

'ప్రసాద్' స్కీం కింద నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా ఇప్పటికే ఆలస్యం అయిందని కేంద్ర అధికారులకు తెలియచేశాం. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియచేసి వెంటనే నిధులు మంజూరు చేయించేందుకు ప్రయత్నిస్తామని వారు చెప్పారు.

నాకాబందీలో 150 వాహనాల సీజ్

సామర్లకోట: వచ్చే నెల 4వ తేదిన జరిగే ఎన్నికల కౌంటింగ్‌లో ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా సామర్లకోట, పెద్దాపురం పోలీసు స్టేషన్ల పరిధిలో నాకా బందీ కార్యక్రమం నిర్వహించినట్టు పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి మంగళవారం రాత్రి విలేకరులకు తెలిపారు. కాకినాడ ఎస్పీ ఆదేశాలతో రెండు పోలీసు స్టేషన్ల పరిధిలో నాకాబందీలో భాగంగా వాహనాల రికార్డులను తనిఖీ చేశామన్నారు. మైనర్లు నడుపుతున్న వాహనాలను తనిఖీ చేశామన్నారు. దీనిలో భాగంగా పెద్దాపురం పోలీసు స్టేషన్ పరిధిలో 110, సామర్లకోట పోలీసు స్టేషన్ పరిధిలో 40 వాహనాలను సీజ్ చేసినట్టు తెలిపారు. వాహనాల యజమానులు రికార్డులు ఆయా పోలీసు స్టేషన్లలో చూపి వాహనాలు తీసుకువెళ్లవచ్చని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. రికార్డులు లేని వాహనాలకు సంబంధించి ఆయా సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకు నాకాబందీ ఉంటుందన్నారు. సమావేశంలో సీఐలు వై.రవికుమార్, డి.సురేష్ సీజ్ చేసిన వాహనాల వివరాలను తెలిపారు.

వడ దెబ్బకు ఉపాధి కూలీ మృతి


రమణాతి సాయిలక్ష్మి

ఐ.పోలవరం: మండలంలో వడ దెబ్బకు ఉపాధి కూలీ మృతి చెందింది. స్థానికులు, అధికారుల కథనం ప్రకారం మురమళ్లలో ఉపాధి హామీ పథకంలో మంగళవారం కాలువలో పూడిక తీత పనులు చేస్తున్నారు. ఉపాధి కూలీ రమణాతి సాయిలక్ష్మి(52) వడ దెబ్బ తగలడంతో ఉపాధి పని ముగించుకొని ఇంటికి వస్తుండగా సొమ్మసిల్లి పడిపోయింది. స్థానికులు ప్రాథమిక వైద్యం చేయించినా ఫలితం లేకపోయింది. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వడదెబ్బతో మృతి చెందిన సాయిలక్ష్మి కుటుంబ సభ్యు లను పంచాయతీ కార్యదర్శి రవిరాజు, ఉపాధి సిబ్బంది వివరాలు సేకరిస్తున్నా రు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియజేశామని కార్యదర్శి పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు...


సత్తిబాబు మృతదేహం వద్ద వివరాలు నమోదు చేస్తున్న పోలీసులు

కొవ్వూరు: ఈ నెల 26వ తేదీన చీమలమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన తొగుమ్మి గ్రామానికి చెందిన బొల్లెం సత్తిబాబు (78) రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు రూరల్ ఎస్సై కె.సుధాకర్ తెలిపారు. ఇటీవల భార్య చనిపోవడంతో తీవ్ర మనస్థాపంతో ఉన్న సత్తిబాబు తొగుమ్మిలో కుమార్తె చొప్ప లక్ష్మి ఇంటిలో ఉంటున్నారు. లక్ష్మి పనికి వెళ్లడంతో ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో చీమల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డారు. సాయంత్రం లక్ష్మి వచ్చేసరికి సత్తిబాబు అపస్మారక స్థితిలో ఉన్నారని, 108 అంబులెన్స్‌లో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందినట్లు ఆయన కుమార్తె లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

అల్లవరం: కుటుంబంలో తరుచుగా గొడవ చేస్తున్నావని, పోలీసులకు ఫిర్యాదు చేస్తానని భార్య హెచ్చరించడంతో మనస్థాపం చెందిన బెండమూర్లంక గ్రామస్తుడు ఈలీ నరేష్ (45) సోమవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై హరీష్‌కుమార్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం ఈలీ నరేష్ అతని భార్య మౌనికతో తరచుగా గొడవలు పడుతుండేవాడు. కుటుంబంలో జరుగుతున్న గొడవలకు నీవే కారణమని, పోలీసులకు ఫిర్యాదు చేస్తానని మౌనిక నరేష్‌ను హెచ్చరించింది. దీంతో నరేష్ ఎలాగైనా తనపై ఫిర్యాదు చేస్తుందని భావించి మనస్థాపానికి గురై తన ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై హరీష్‌కుమార్ తెలిపారు. మృతుడుకి భార్య, బాబు, పాప ఉన్నారు.

వేద పఠనంతో గ్రామ ప్రదక్షిణ

- గంగలకుర్రులో వేదశాస్త్ర ప్రవర్ధక సభ వార్షికోత్సవం
- పరీక్షకు ఇతర రాష్ట్రాల విద్యార్థులు


గంగలకుర్రులో విద్యార్థికి పరీక్ష నిర్వహిస్తున్న పండితులు

అంబాజీపేట: నిత్యం వేద పఠనం ఎక్కడ జరుగుతుందో ఆ ప్రాంతమంతా సస్యశ్యామలంగా ఉంటుందని ప్రముఖ వేద పండితుడు గుళ్ళపల్లి సీతారామ శ్రీహర్ష ఘనాపాఠి అన్నారు. మండలంలోని గంగలకుర్రులో శ్రీ గోదావరి మండల వేదశాస్త్ర ప్రవర్ధక సభ చారిటబుల్ ట్రస్ట్ 73వ వార్షికోత్సవం జయంతి భాస్కర సుబ్రహ్మణ్యం స్వగృహంలో రెండవ రోజు మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వేదపఠనంతో గ్రామపదక్షిణ గావించారు. ఇలాచేయడం వల్ల లోకహితం కలుగుతుందని శ్రీహర్ష ఘనాపాఠి అన్నారు. అనంతరం పరీక్షల నిర్వహణాధికారి, ట్రస్టు సహాయ కార్యదర్శి భమిడిపాటి యజ్ఞేశ్వర ప్రసాద్ పర్యవేక్షణలో వేద, శాస్త్ర, శ్రౌత, స్మార్త, అపర, ఆగమ విద్యలలో పరీక్షలు నిర్వహించారు. సుమారు 250 మంది విద్యార్థులు ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి హాజరయ్యారు. పరీక్షా అధికారులుగా కడియాల సీతారామ అవధాని ఘనాపాఠీ, గుళ్ళపల్లి సీతారామ శ్రీహర్ష ఘనాపాఠి, కర్రా సోమసుందర శర్మ వ్యవహరించారు.

వేద పరీక్షలకు ఇతర రాష్ట్రాల విద్యార్థులు

వేద పరీక్షలకు తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలతో పాటు చిత్తూరు జిల్లా ధర్మస్థలి, అన్నవరం వేద పాఠశాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. వీరు మాట్లాడుతూ తాము వేద విద్యలో తగిన పట్టా పొందేందుకు వచ్చినట్లు తెలిపారు.

పిల్లల ఆసక్తిని గమనించాం

వేద పరీక్షలకు తూర్పుగోదావరి జిల్లా అన్నవరం నుంచి వేద విద్యార్థులు తమ తల్లులతో సహా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లులు మాట్లాడుతూ చిన్నతనం నుంచే తమ పిల్లలకు వేదవిద్యపై ఉండే ఆసక్తిని గమనించామన్నారు. సంప్రదాయ కుటుంబాల నుంచి వచ్చిన నేపథ్యంలో ఉపనయనాది సంస్కారాలు చిన్నతనంలోనే నిర్వహించామని అనంతరం అన్నవరంలో ఉండే స్మార్త ఆగమ పాఠశాలకు పంపామన్నారు. భమిడిపాటి సుబ్రహ్మణ్య సోమయాజులు, తేజోమూర్తుల ఉదయ సాయి ప్రద్యుమ్న తల్లులు మాట్లాడుతూ భవిష్యత్తులో మంచి వేద పండితులుగా తమ పిల్లలు రాణించాలన్నదే తమ అభిమతమన్నారు.

న్యాయ సేవలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి ప్రకాష్‌బాబు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రజలకు అందుబాటులో ఉన్న న్యాయ సేవలు, సంక్షేమ పథకాలపై స్థానిక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రకాష్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ఇతరులకు ఇబ్బంది కలిగే పనులు చేయరాదన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న సేవలపై అవగాహన పెంచుకోవాలన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలన్నారు. ఐసీడీఎస్ పీడీ విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలు, చిన్నారుల సంక్షేమానికి అందుబాటులో ఉన్న సేవలను వివరించారు. రాజమహేంద్రవరం అడిషనల్ మున్సిపల్ కమిషనర్ పీఎం సత్యవేణి వివిధ సంక్షేమ పథకాలను తెలిపారు. సదస్సులో జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ పీఎస్ రమేష్, జిల్లా ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ ఎం.సందీప్, జిల్లా ఎస్టీ వెల్ఫేర్ ఆఫీసర్ కె.జ్యోతి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ పి.సూర్య ప్రభావతి, రాజమహేంద్రవరం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ టీఎస్ కార్తీక్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రొయ్యల చెరువులో విషం కలిపిన దుండగులు

కాట్రేనికోన: మండలంలోని కాట్రేనికోన పంచాయతీ గచ్చకాయలపోరలో బొమ్మిడి బాలరాజుకు చెందిన రొయ్యలు చెరువులో గుర్తుతెలియని దుండగులు విషం కలిపారు. రొయ్యలు మృత్యువాత పడి సుమారు రూ.4 లక్షల నష్టం వాటిల్లింది. బాలరాజు 1.5 ఎకరాల చెరువులో రెండు లక్షలు రొయ్య పిల్లలను వేశాడు. 60 రోజులు పెంచాడు. ప్రతి రోజు మాదిరిగా సోమవారం రాత్రి 8 గంటలకు ఇంజన్లు వేసి భోజనం కోసమని ఇంటికి వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి చెరువు వద్ద క్రిమి సంహారక మందు వచ్చింది. ఎవరో విషం కలిపినట్టు గుర్తించారు. చెరువులో రొయ్య అన్నీ చనిపోయాయి. ఈ మేరకు రైతు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నాగేశ్వర రావు తెలిపారు.